వైభవంగా అమ్మవారి జాతరలు

- ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవార్లు
- మొక్కుబడులు చెల్లించుకున్న భక్తులు
- ఆకట్టుకున్న చాందినీ బండ్లు



పెనగలూరులో పూజలందుకున్న ఎల్లమ్మ



పెనగలూరు : ఎల్లమ్మతల్లి ఆలయంలో పొంగుబాళ్లు పొంగిస్తున్న దృశ్యం



గాలివీడు: అమ్మవారికి బోనాలు తీసుకెళ్తున్న భక్తులు



చిట్వేలి: ప్రత్యేక అలంకారంలో ఓసూరమ్మ

సుండుపల్లె : మండల పరిధిలోని పెద్దమాదిగపల్లె గ్రామంలో వెలసిన మాతమ్మ తల్లి మహిమగల దేవత అని భక్తుల నమ్మకం. మండల పరిధిలోని పెద్దమాదిగపల్లె గ్రామంలో ఆదివారం మాతమ్మ తిరునాల ఉత్సవాలను పురస్కరించుకొని అమ్మవారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పలువురు భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి తీర్థప్రసాదాలను స్వీకరించారు. మొక్కుబడులు ఉన్న భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. రాత్రి రంగురంగుల విద్యుత్ దీపాలంకరణచే మేళతాళాలు, డప్పు వాయిద్యాల మధ్య ఏర్పాటు చేసిన చాందినీ బండ్లు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. సాంస్కృతిక కార్యక్రమాలతో తిరునాలను అత్యంత వైభవంగా జరిపారు.

ఘనంగా ఇరుగులమ్మ తిరునాల

సిద్దవటం : మండలంలోని మాలపల్లె క్రాస్ రోడ్డు వద్ద పెన్నానది ఒడ్డున వెలసిన ఇరుగులమ్మ తిరునాల ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇరుగులమ్మకు అభిషేకం, అలంకరణ, దేవీ సహస్రనామార్చన, కుంకుమార్చన, ఆకుపూజ వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తరువాత భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. మరికొందరు భక్తులు అమ్మవారి దర్శంచుకుని కాయాకర్పూరాలను సమర్పించి తీర్థప్రసాదాల స్వీకరించారు. తిరునాలకు వచ్చిన భక్తులకు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. రాత్రి 9 గంటలకు సానవల చిన్నమ్మ కథ నాటకం నిర్వహిస్తామని ఆలయ అర్చకులు టి.వెంకటరమణ తెలిపారు.

నల్లగంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

సంబేపల్లె : మండల పరిధిలోని సంబేపల్లె గ్రామంలో వెలసిన దేవరరాయి నల్లగంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం కావడంతో మండలం నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. మొక్కుబడులు తీరిన వారు అమ్మవారికి బోనాలు సమర్పించారు. బంధుమిత్రులతో కలిసి విందును ఆరగించారు. వచ్చిన భక్తాదులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందించారు.

ఎల్లమ్మతల్లికి పొంగళ్లు

పెనగలూరు (ఓబులవారిపల్లె) : మండల కేంద్రమైన పెనగలూరులో ఎల్లమ్మతల్లికి ఆదివారం ఉదయం ఘనంగా పొంగళ్లు నిర్వహించారు. వందలాది మంది భక్తులు తమ పొంగళ్లు పొంగించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయం ముందు భారీగా రంగులతో వేసిన అమ్మవారి ప్రతిమను వేసి చూపరులను ఆకట్టుకుంది. శనివారం రాత్రి ఎల్లమ్మ ఆసాదు కథ ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి కాయాకర్పూరం సమర్పించారు.

ఓసూరమ్మకు పొంగళ్లు

చిట్వేలి : భక్తుల కొంగుబంగారంలా విరాజిల్లుతున్న ఓసూరు ఎల్లమ్మతల్లికి ఆదివారం భక్తులు పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. మైలపల్లి సమీపంలో వెలసి ఉన్న ఓసూరు ఎల్లమ్మకు గ్రామ ప్రజలు పొంగళ్లు, ముద్దలు, బలిదానాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ ఏడాది రైతులు పాడిపంటలతో సమృద్ధిగా ఉండాలని అమ్మవారిని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

గాలివీడు మండలంలో రేణుకా ఎల్లమ్మ జాతర

గాలివీడు : భక్తుల పాలిట కల్పవల్లి, కొలిచిన వారికి కొంగు బంగారమైన శ్రీ రేణుకా ఎల్లమ్మ జాతర ఉత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. మండలంలోని నూలివీడు గ్రామంలో వెలిసిన అమ్మవారికి శనివారం సద్దలకూడు నైవేద్యంతో ప్రారంభమై సాంప్రదాయ పద్ధతిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్ధరాత్రి చెక్కభజనలు, కోలాటం పలు నృత్యాల నడుమ విద్యుత్ దీపాలతో అలంకరించిన చాందినీ బండ్ల గ్రామోత్సవం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తెల్లవారుజామున మహిళలు బోనాల రూపంలో అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.



సుండుపల్లె: దర్శనమిస్తున్న మాతమ్మ



సంబేపల్లె: అలంకరణలో దేవరరాయి నల్లగంగమ్మ



సుండుపల్లె : భక్తులను ఆకట్టుకున్న చాందినీ బండి



సిద్దవటం : పూజలందుకున్న ఇరుగులమ్మ

క్లుప్తంగా

ఆర్‌యూబీని ఏర్పాటు చేయండి



రెడ్డిపల్లి రైల్వేగేటు

పుల్లంపేట : రెడ్డిపల్లి రైల్వేస్టేషన్ వద్ద అండర్ బ్రిడ్జి లేకపోవడంతో ప్రయాణికులు, వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. రైల్వే గేటు వేస్తే సుమారు పది నుంచి ఇరవై నిమిషాల పాటు వాహనదారులు, ప్రజలు వేచి ఉండాల్సిన పరిస్థితి. ఈ రహదారి గుండా ప్రతినిత్యం వందలాది వాహనాలు వెళ్తున్నాయి. కావున సంబంధిత అధికారులు స్పందించి రైల్వే అండర్ బ్రిడ్జిని ఏర్పాటు చేయాలని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

పరామర్శ



మృతదేహాన్ని సందర్శిస్తున్న ఎమ్మెల్యే రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి టౌన్ : వీరబల్లె మండలం వంగిమళ్ల సమీపాన ఉన్న పుల్లగూర గండిలో పడి మృత్యువాత పడిన అద్నాన్ (13) కుటుంబ సభ్యులను రాయచోటి ఎమ్మెల్యే మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి పరామర్శించారు. ఆదివారం ఈ సంఘటన చోటు చేసుకుంది. ఈ దుర్ఘటనలో రాయచోటి పట్టణానికి చెందిన టైలర్ షకీల్ కుమారుడు మృత్యువాత చెందడంతో ఎమ్మెల్యే ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. మృతదేహాన్ని పరామర్శించి వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

విద్యుత్ పునరుద్ధరణ



విద్యుత్ మరమ్మతు పనులు చేస్తున్న దృశ్యం

ఓబులవారిపల్లె : మండల కేంద్రంలో చింతచెట్టు కురుస్తున్న వర్షానికి పడిపోవడంతో విద్యుత్ తీగలు తెగిపోయాయి. దీంతో మూడు రోజులుగా విద్యుత్‌కు అంతరాయం కలగడంతో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడ్డారు. ఆదివారం విద్యుత్ ఏఈ కిరణ్, లైన్‌మెన్ చిన్నలు విద్యుత్ మరమ్మతు పనులను పునరుద్ధరించడంతో తాగునీటి సమస్య తీరింది. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు సానుగారి విశ్వనాథరెడ్డి, జబ్బిరెడ్డి నాని తదితరులు పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న గ్రంథాలయ నిర్వాహకులు అష్రఫ్ అలీ

ఓబులవారిపల్లె : మండల కేంద్రంలోని గ్రంథాలయంలో సమ్మర్ క్యాంప్ విజేతలకు ఆదివారం గ్రంథాలయ నిర్వాహకులు అష్రఫ్ అలీ బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అష్రఫ్ అలీ మాట్లాడుతూ మే నెల నుంచి జూన్ 7వ తేదీ వరకు స్థానిక గ్రంథాలయంలో సమ్మర్ క్యాంప్‌ను నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సమ్మర్ క్యాంప్ ద్వారా విద్యార్థులు మంచి పుస్తకాలు చదవడంతోపాటు ఆటల పోటీలు నిర్వహించామన్నారు. గెలుపొందిన విజేతలకు ముగింపు సందర్భంగా బహుమతులు అందజేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మురుగునీటితో దుర్వాసన



పంచాయతీలోని ప్రధాన రహదారి పక్కన డ్రైనేజీలో ఉన్న మురుగునీరు

సిద్దవటం : మండలంలోని మాధవరం-1 గ్రామ పంచాయతీ లోని కడప-చెన్నై ప్రధాన రహదారిలో డ్రైనేజి కాలువలో చెత్తా చెదారంతో మురుగునీరు పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతుంది. రహదారి వెంబడి పాదచారులు, ద్విచక్ర వాహనదారులు వెళుతుంటే దుర్వాసన వస్తోందని పలువురు స్థానికులు తెలిపారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోని డ్రైనేజీ కాలువలను శుభ్రం చేయాలని, లేదంటే సీజనల్ వ్యాధులు సంభవిస్తాయని స్థానికులు తెలియజేశారు.

ఉపాధ్యాయ సమస్యలపై రాజీలేని పోరాటం

ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సుబ్రమణ్యంరాజు



రాజంపేట టౌన్: ఎస్టీయూ జెండాను ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

రాజంపేట టౌన్ : విద్యారంగ పరిరక్షణకు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం సాగిస్తామని ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సుబ్రమణ్యంరాజు తెలిపారు. పట్టణంలోని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) కార్యాలయంలో ఆదివారం ఆ యూనియన్ 78వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్టీయూ నాయకులు జెండాను ఆవిష్కరించారు. అనంతరం సుబ్రమణ్యంరాజు మాట్లాడుతూ 1947వ సంవత్సరం జూన్ 9న ఉపాధ్యాయుల వాణిగా ఎస్టీయూ ఆవిర్భవించిందన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఉపాధ్యాయుల సమస్యలపై, విద్యారంగ పరిరక్షణకు అలుపెరుగని పోరాటాలు సాగిస్తూనే ఉందన్నారు. ఎస్టీయూ పోరాటాల ఫలితంగా అనేక సమస్యలు పరిష్కారం అయ్యాయని తెలిపారు. ఎస్టీయూ పోరాటం వల్ల పీఆర్‌సీ విధానం అమలు, అప్రెంటీస్ విధానానికి విముక్తి లభించిందని తెలిపారు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా ఆ ప్రభుత్వాలపై పోరాటాలు సాగిస్తూ విద్యారంగాన్ని పరిరక్షించుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజంపేట, నందలూరు, పెనగలూరు, పుల్లంపేట మండలాలకు చెందిన ఎస్టీయూ నాయకులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా

రాయచోటి అర్బన్ : రాష్ట్రంలో విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యలను పాలకులు వెంటనే పరిష్కరించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక డైట్ సభా భవనంలో యూటీఎఫ్ జిల్లా మధ్యంతర కౌన్సిల్ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ జీఓ - 117ను వెంటనే రద్దు చేయాలని, ప్రాథమిక పాఠశాలల వ్యవస్థను కొనసాగించాలని, పాఠశాలల విలీనాన్ని రద్దుచేయాలని కోరారు. ఆదర్శ ప్రాథమిక పాఠశాలల విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక బిల్లులను వెంటనే చెల్లించాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి జాబీర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు మీడియంను పునరుద్ధరించాలని కోరారు. తిరోగమనంలో ఉన్న విద్యారంగం పైన ప్రత్యేక దృష్టిని సారించాలన్నారు. మెగా డీఎస్సీ ద్వారా ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీచేయాలని, పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలంటూ కోరారు. సమావేశంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్, జిల్లా గౌరవ అధ్యక్షుడు సుధాకర్‌నాయుడు, సహ అధ్యక్షుడు శివారెడ్డి, హేమలత, కోశాధికారి చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శులు రమణమూర్తి, వెంకటరమణ, ఆదినారాయణ, శ్రీధర్‌రెడ్డితో పాటు పలువురు నేతలు పాల్గొన్నారు.

సమరశీల పోరాటాలకు ప్రతీక సీఐటీయూ

సీఐటీయూలో పలువురు కార్మికుల చేరిక



సీఐటీయూలో చేరినవారితో ఆ సంఘం నేతలు

రాయచోటి అర్బన్ : సమరశీల పోరాటాలకు ప్రతీక సీఐటీయూ అని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణం అన్నారు. ఆదివారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో జరిగిన మున్సిపల్ వర్కర్ల జిల్లాస్థాయి విస్తృత సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ గత కొన్ని దశాబ్దాలుగా కార్మిక హక్కుల రక్షణ చట్టాల అమలుకు పోరాటం చేశామన్నారు. కార్మిక సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటం చేయడం జరుగుతుందన్నారు. మున్సిపల్ వర్కర్‌లతోపాటు అంగన్‌వాడీ, ఆశ, సంఘమిత్ర, ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మెకు సీఐటీయూ నాయకత్వం వహించడం జరిగిందన్నారు. పెట్టుబడిదారి ప్రభుత్వాలను కూల్చి కార్మికవర్గ రాజ్యస్థాపన చేయడమే ధ్యేయం అన్నారు. అనంతరం ఆయన బి.వి.రమణ, శంకరయ్య, చంద్రశేఖర్, ఈశ్వర్‌రెడ్డి, ప్రభాకర్, మహేష్, వెంకటలక్ష్మి, మౌనిక, రమేష్‌బాబు, ఈశ్వరమ్మతోపాటు పలువురు పారిశుధ్య కార్మికులను సీఐటీయూలో చేర్చుకున్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పి.శ్రీనివాసులు, ఓబులమ్మ, రామాంజులు, ప్రసాద్, రమణ, పెంచలయ్య, రవిశంకర్, చెన్నయ్య, రాంబాబు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్డీయే శ్రేణుల సంబరాలు



కేక్ కట్ చేస్తున్న కూటమి నేతలు



ప్రసాదం పంపిణీ చేస్తున్న భరత్‌కుమార్‌రెడ్డి

నందలూరు : నరేంద్రమోడీ దేశ ప్రధానిగా మూడోసారి ప్రమాణస్వీకారం చేస్తున్న సందర్భంగా నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ సమీపంలో ఆదివారం సాయంత్రం కూటమి నేతలు కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్ రెడ్డి మాట్లాడుతూ నందలూరు రైల్వేకేంద్రంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అదే విధంగా టంగుటూరు, ఓబిలి గ్రామాల మధ్య బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు పోతురాజు మస్తానయ్య, జంబు సూర్యనారాయణ, హిమగిరినాథ్ యాదవ్, సయ్యద్ అమీర్, నాగరాజరావు, దండు నాగేశ్వరరావు, మునిస్వామి, ఉప్పుశెట్టి సుధీర్, మోడపోతుల రాము, తాటి సుబ్బరాయుడు, మౌలా, ఉల్లి ఉపేంద్ర కుమార్, జంగంశెట్టి సుబ్బయ్య, నారపుశెట్టి వేణు, గంధం గంగాధర్, గుండు సురేష్, గొబ్బిళ్ల సుబ్బరాయుడు, గురువిగారి వాసు, మట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమంలో ప్రసాదం పంపిణీ

ఓబులవారిపల్లె : కేంద్రంలో మూడోసారి ప్రధానిగా నరేంద్రమోడీ ప్రమాణస్వీకారం సందర్భంగా ఆదివారం యల్లాయపల్లి చిన్మయ ఆశ్రమంలో బీజేపీ యువనాయకులు జై భరత్‌కుమార్‌రెడ్డి తిరుమల ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరేంద్రమోడీ ప్రధాన మంత్రిగా ప్రమాణస్వీకారం చేయడం చారిత్రాత్మకమైన విషయమన్నారు. దేశంలో జవహర్ లాల్ నెహ్రూ తరువాత వరుసగా మూడోసారి ప్రధాన మంత్రిగా నరేంద్రమోడీ ప్రమాణస్వీకారం చేసి చరిత్ర సృష్టించారని, దేశ అభివృద్ధికి కూడా ఆయన నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. అనంతరం ఆశ్రమంలోని విద్యార్థినీ విద్యార్థులు, వృద్ధులకు తిరుమల ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చిన్మయ ఆశ్రమం నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

ఆనంద క్షణాలు.. మరువలేని జ్ఞాపకాలు



సమ్మేళనానికి హాజరైన పూర్వ విద్యార్థులు

పుల్లంపేట : మండల కేంద్రంలోని ఎస్‌బీవీడీ సభా హైస్కూల్‌లో 1982-83 పదోతరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఆదివారం గెట్ టుగెదర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని పుల్లంపేటలో చదివి రాజంపేటలో స్థిరపడిన పూర్వ విద్యార్థులు ఈ కార్యక్రమం ఏర్పాటు చేసుకున్నారు. ఈ సమ్మేళనానికి 70 మందికిపైగా విద్యార్థులు పాల్గొనడం విశేషం. విద్యార్థిగా ఉన్న సమయంలో పాఠశాలతో ఉన్న ఆనంద క్షణాలను గుర్తు చేసుకున్నారు. అప్పటి జ్ఞాపకాలను ఒకరికొకరు పంచుకుంటూ ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా విద్యార్థులందరూ ప్రతి ఏడాది ఒకసారి పూర్వవిద్యార్థుల సమ్మేళనం జరుపుకోవాలని నిర్ణయించుకున్నారు.

తోటి స్నేహితునికి అండగా..

1982-83 పదోతరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థి ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతుండటంతో రూ. 28 వేలు అక్కడికక్కడే వసూలు చేసి పేద విద్యార్థికి అందించారు.

నేడు ఆత్మజ్ఞానంపై బోధన

రాజంపేట టౌన్ : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానం ఆవరణలో ఉన్న సరస్వతి పిరమిడ్ ధ్యాన మందిరంలో సోమవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆత్మజ్ఞానంపై బోధనా కార్యక్రమం ఉంటుందని పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ ప్రతినిధి ఆంజనేయులునాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భీమవరానికి చెందిన బ్రహ్మవిద్యారిష్ట తటపర్తి రాజ్యలక్ష్మి ఆత్మజ్ఞానంపై బోధన చేస్తారన్నారు. మనిషి సన్మార్గం వైపు పయనించేందుకు ఈ బోధనా కార్యక్రమం దోహదపడగలదని చెప్పారు. అందువల్ల ప్రజలు పెద్దఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. మధ్యాహ్నం కంచెర్ల శిరీష, కంచెర్ల కిషోర్‌రెడ్డి ఆధ్వర్యంలో ధ్యానప్రసాదం పంపిణీ కార్యక్రమం ఉంటుందని తెలియజేశారు.

మొక్కులు తీర్చుకున్న భక్తులు



ప్రత్యేక అలంకారంలో దర్శనమిస్తున్న గంగమ్మ

లక్కిరెడ్డిపల్లె : అనంతపురం గంగమ్మ దేవతకు ఆదివారం వేలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించి, తలనీలాలు అర్పించారు. ఆదివారం కావడంతో చుట్టుపక్కల ప్రాంతాల వారే కాకుండా ఇతర జిల్లాల నుంచి వేలాదిగా భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణమంతా భక్తులతో కిక్కిరిసింది. భక్తులు క్యూ లైన్లలో వేచి ఉండి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రత్యేక అధికారి భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా పర్యవేక్షణ చేపట్టారు. పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయ పూజారులైన చెల్లు వంశీయులు గంగాధర్, రవిలు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి అమ్మవారి విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



గంగమ్మకు మొక్కులు చెల్లిస్తున్న నాయకులు

రామాపురం : సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయాన్ని పురస్కరించుకుని ఆదివారం ఆదివారం మండలంలోని చిట్లూరు గ్రామ పంచాయితీ టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కలిసి గ్రామంలోని గంగమ్మ తల్లి ఆలయం ఎదుట 101 టెంకాయలు కొట్టి మొక్కులను చెల్లించుకున్నారు. నియోజకవర్గంలోని ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు.

విస్తారంగా జీలుగ సాగు



మండలంలో సాగులో ఉన్న జీలుగ పంట

సిద్దవటం : మండలంలో రైతులు విస్తారంగా జీలుగ పంటను (పచ్చిరొట్టె ఎరువు)సాగు చేశారు. ఏరువాకకు ముందుగా రైతులు జీలుగ విత్తనాలు పొలాల్లో చల్లుకుని సాగు చేశారు. వరిసాగుకు నెల రోజులు ముందుగా విత్తనాలను విత్తుకుంటారు. ఏపుగా పెరిగిన జీలుగ పంటను దుక్కి దున్ని మూడురోజుల వరకు బాగా నీరు పెడతారు. ఇలా చేయడం వలన ఆకులు బాగా కుళ్లి పచ్చిరొట్టెలా మారి మంచి ఎరువుగా తయారవుతుంది. దీనివల్ల పంటకు రసాయానిక ఎరువులు వేయనవసరం ఉండదు. అధిక దిగుబడి కూడా సాధించవచ్చు. అంతే గాకుండా చీడను కూడా నివారించవచ్చని రైతులు తెలిపారు.

మహాభారత యజ్ఞం ప్రారంభం

పీలేరురూరల్ : స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణలో ఆదివారం మహాభారతయజ్ఞం ప్రారంభమైంది. మొదటి రోజు మధ్యాహ్నం బంగారుపాళెంకు చెందిన భాగవతారణి టి.రెడ్డికుమారిచే ×సర్పయాగం ₹ హరి కథా కాలక్షేపం నిర్వహించారు. రాత్రి వెంకటేశ్వర నాట్యకలామండలి మల్లికార్జున బృందంచే శ్రీకృష్ణ లీలలు నాటకం నిర్వహించారు. ఈ నెల 26వ తేదీ వరకు మహా భారతయజ్ఞం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగరాజనాయక్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

రెడ్డెమ్మకొండ ఛైర్మన్ రాజీనామా

గుర్రంకొండ : మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మ కొండ ఆలయ అభివృద్ధి కమిటీ ఛైర్మెన్ నరసింహారెడ్డి తన పదవికి రాజీనామా చేశారు. ఆదివారం రెడ్డెమ్మకొండ ఈవో మంజులకు తన రాజీనామా పత్రాన్ని పంపారు. రెండు పర్యాయాలు తనకు ఛైర్మెన్‌గా అవకాశం లభించిందన్నారు. వైఎస్సార్‌సీపీ ఓటమి చెందినందున తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.